# 10

# సిలువ వేయబడి, లేపబడెను

## (యోహాను 19 మరియు 20)

యేసు మరణమునకు నిత్యత్వ ప్రాధాన్యత నిచ్చిన యోహాను ఆయన సిలువ శ్రమలకు మాత్రము యోహాను 19:18ఎలో సంక్షిప్త రూపమును ఇచ్చాడు: "అక్కడ యేసును సిలువవేసిరి." ఇంగ్లీషు భాషలో దీన్ని వివరించుటకు నాలుగు పదాలు వ్రాయబడగా, యోహాను వ్రాసిన గ్రీకులో మూడు పదాలు మాత్రమే వాడబడ్డాయి.

ఈనాడు యేసుని శ్రమల గురించి విస్తారముగా బోధింపబడుచున్నట్లుగా గాక, ఆయన శ్రమలను గురించిన ఎక్కువ వివరణ ఇక్కడ ఇవ్వబడలేదు. సిలువ వేయబడుటకు ముందు యేసు అనుభవించిన శ్రమలను మరింత భయానకంగా వివరిస్తూ శ్రోతల, చదువరుల భావములతో యోహాను ఆటలాడుకోవడం లేదు. ఇందుకు రెండు కారణాలున్నాయి.

మొదటిగా, యోహాను ఎవరి నిమిత్తం తన సువార్తను వ్రాశాడో ఆ కాలపు వారికి సిలువ శ్రమలు, శిక్షలను గురించి బాగా తెలుసు. యేసునకు విధించబడినవన్నియు అనేక వేలమందికి జరిగాయి. ఇతరులు ముందుకు నేరం చేయకుండ ఉండునట్లు, ఇవి బహిరంగంగానే జరిగేవి.

యేసును పిలాతు విచారించడం యోహాను 18:33లో ఆరంభమయింది. యేసు రోమా సామ్రాజ్యమునకు వ్యతిరేకంగా ఏమీ చేయలేదని కొన్ని మతపర వివాదాలవల్లనే తన దగ్గరకు తేబడ్డాడని గవర్నరుకు అర్థమయింది. మతాధిపతులలో ఉన్న రక్తదాహమును తీర్చుటకు, తద్వారా వారు ఆయన్ను సిలువ వేయాలన్న కోరికను మానుకుంటారన్న (చూడు లూకా 23:16, 22) ఉద్దేశంతో పిలాతు యేసునకు శిక్ష విధించాడు (19:1-5), పిలాతు యేసును శిక్షించిన తరువాత ఆయన్ను వెలుపలికి తీసుకు వచ్చి "ఇదిగో ఈయనయందు ఏ దోషమును నాకు కనబడలేదని మీకు తెలియునట్లు ఈయనను మీయొద్దకు వెలుపలికి తీసికొని వచ్చుచున్నానని" పిలాతు పేర్కొన్నట్లు యోహాను 19:4 స్పష్టం చేస్తుంది. తరువాత అతడు "ఇదిగో ఈ మనుష్యుడు" అని యేసును వారికి చూపించాడు (5 వచనం). ఈ మాట ఆశ్చర్యమును వ్యక్తపరిచే మాట: "ఇదిగో చూడండి ఈయన్ను చూసి మీరు భయపడుతున్నారా?" అన్నది దీని అర్థం. అయినా వారు శాంతించక యేసు రక్తము కోసం అరుస్తూనే ఉన్నారు. దీంతో విసిగిపోయిన పిలాతు "-ఆయనయందు ఏ దోషమును నాకు కనబడలేదు. గనుక మీరే ఆయనను తీసికొనిపోయి సిలువచేయుడని" (6బి వచనం) వారికి అప్పగించాడు.

సహజంగా సిలువ వేయడానికి ముందే శిక్షిస్తారు. ఇందులో భాగంగానే, అపరాధిని పొట్టిగానున్న తోలు కొరడాతో కొడతారు. దీని చివరి ఇనుము, ఎముక, గాజుతో చేయబడిన ముక్కలు సూదిగా తగిలించబడి ఉంటాయి. ఇది చర్మాన్ని చీల్చి మాంసమును పెరికి సిలువకు ముందే మరణ యాతనను కలిగించి ఒక్కోసారి మరణమునూ కలిగిస్తుంది. ఒక్కోసారి అపరాధులు ఎంతగా శిక్షించబడే వారంటే, కొరడా దెబ్బలకు వారి శరీరం చీల్చబడి వారి

అంతర్గత శరీర అవయవములు బయటకు కనబడేవని నాలుగవ శతాబ్దపు చరిత్రకారుడు Eusebius వ్రాస్తున్నాడు.[1] యేసు కూడా ఎంతగా శిక్షించబడ్డాడంటే, తరువాత ఆయన సిలువ చెక్కను సిలువ స్థలము వరకు మోయలేకపోయాడు (మత్తయి 27:32).

సిలువను మోయడం అనేది ఎప్పుడూ బహిరంగ ప్రదేశాలలోనే జరిగేది అంటే పట్టణ ప్రధాన మార్గములు, జనసమృద్ధి ప్రదేశాల గుండానే జరిగేది. ఎందుకంటే, ఇతర ప్రజలందరి దృష్టిని ఆకట్టుకునే ఈ సన్నివేశం వారికి హెచ్చరికగా ఉండేది. యేసును సిలువ వేసిన స్థలము "పట్టణమునకు సమీపముగా" ఉన్నదని యోహాను ప్రత్యేకంగా వ్రాస్తున్నాడు. దాని ఫలితంగా యేసు తలకు పైగా పిలాతు వ్రాయించిన పైవిలాసమును అనేకమంది చదువగలిగారు (యోహాను 19:19, 20; చూడు మత్తయి 27:37). యోహాను కాలంలోని చదువరులకు సిలువ శిక్ష అంటే ఏమిటో బాగుగా తెలియును - మేకులను అరచేతులలో, కాళ్ళలో దిగగొట్టేవారు (ఒక్కోసారి మడిమలలోనూ దిగించేవారు). అప్పుడు బాధితుడికి మరణం నెమ్మదిగా సంభవించేది. కొన్నిసార్లు రెండు దినముల వరకు కొనప్రాణంతో ఉండేవారు. ఈ విషయమంతా అప్పటివారికి బాగుగా తెలియును. కాబట్టి మరింత వివరాల్లోకి వెళ్ళనవసరం లేదు. కాబట్టి, "అక్కడ యేసును సిలువ వేసిరి" (18ఎ వచనం) అన్న మాట చాలు.

యేసు పొందిన శ్రమలు వివరంగా ఇవ్వబడకపోవడానికి మరో కారణం కూడా ఉంది. యేసు మరణ గాథలో ఈ శ్రమలు అంత ప్రాముఖ్యమైనవిగా యేసునకు అన్పించలేదు. ఇంతకంటే ముఖ్యమైన విషయాలు అతడికి వేరే ఉన్నాయి: (1) ఎవరు సిలువ వేయబడ్డారు, (2) ఆయన ఎందుకు చనిపోయాడు, మరియు (3) అలాగే చనిపోయి అలాగే ఉండిపోలేదు.

## ఎవరు సిలువ వేయబడ్డారు: యూదుల రాజు

యోహాను 18:33-38లో పిలాతు యేసు యొక్క రాజరికమును గురించి ప్రశ్నించినట్లు చూస్తున్నాము. ఈ అధ్యాయం మరియు 19వ అధ్యాయములో ఇదే ప్రధానమైన అంశముగా చూస్తున్నాము. ఈ నేపథ్యంలో, యేసు తాను రాజునని ఒప్పుకుని తన రాజ్యము "ఈ లోక సంబంధమైనది కాదు" (యోహాను 18:36ఎ) అని ఒప్పుకున్నట్లు చూస్తున్నాం - పిలాతు యొక్క రోమా ప్రభుత్వంవలె ఇది తాత్కాలికమైనది కాదు. పస్కా పండుగను పురస్కరించుకుని, ఒక ఖైదీని విడుదల చేయడం వాడుక కాబట్టి, "నేను యూదుల రాజును విడుదల చేయుట మీకిష్టమా?" అని పిలాతు ప్రజలను అడిగాడు (39బి వచనం). అయితే వారు, "వీనిని వద్దు, బరబ్బను విడుదల చేయుమని" కోరారు (ఇతని పేరుకు "తండ్రియొక్క కుమారుడు" అని అర్థం) (40 వచనం).

19వ అధ్యాయంలోకి ప్రవేశించగానే, సైనికులు యేసునకు ముళ్ళ కిరీటం పెట్టి, ఊదారంగు వస్త్రములను ధరింపజేసి, హేళన చేస్తూ రాజు అని వ్యంగ్యంగా మాట్లాడినట్లు చూస్తున్నాం (1-3 వచనాలు). కైసరునకు వేరుగానున్న యేసు యొక్క రాజరికమును గురించి తిరిగి 12 నుండి 16 వచనాలలో మళ్ళీ చర్చించబడింది, "ఇదిగో మీ రాజు" అని యేసును యూదుల యెదుట ఉంచి "మీ రాజును సిలువ వేయుదునా?" అని ప్రశ్నించాడు. ఈ రెండు వ్యాఖ్యాలలోను ఈయనే రాజు అని పిలాతు గుర్తించినట్లు యోహాను పేర్కొంటున్నాడు. యేసు రాజరికం యొక్క తిరస్కారం 15వ వచనంలో కనబడుతుంది. "కైసరు తప్ప మాకు

వేరొక రాజు లేడు" అని చెప్పడం ద్వారా యూదులు దేవునియందలి తమ చారిత్రిక రాజరిక విశ్వాసమును త్రోసిపుచ్చారు. ఇటువంటి సమాధానాన్ని ప్రజలనుండి ఆశించిన పిలాతు ఆఖరికి విధిలేని పరిస్థితుల్లో యేసును సిలువ వేయుటకు ప్రజల చేతులకు అప్పగించాడు.

అయితే యేసుని రాజరికము గురించిన విషయం ఇంతటితో ఆగిపోలేదు. సిలువ వేయబడిన వారి మీద ఒక వివరముతో కూడిన పై విలాసము వ్రాయడం అక్కడ ఆజ్ఞయైయున్నది. ఇందుకు "యూదుల రాజైన నజరేయుడగు యేసు" అన్న మాటను యేసునకు పై విలాసముగా అప్పటి సామాన్యమగు మూడు భాషలలో[2] అందరూ చదువ వీలగునట్లు వ్రాయించాడు పిలాతు (19 వచనం). ఇందుకు యూదులు సహజంగానే వ్యతిరేకించారు. ఇది యేసుని మాటగా వ్రాయుటకు పిలాతు నిరాకరించి "నేను వ్రాసినదేమో వ్రాసితిని" అని అన్నాడు (22 వచనం). నిజానికి అతని పని అంతటితో అయిపోయినను, యేసు యూదుల రాజు అన్న సత్యమునకు అతడు మరోసారి సాక్షి అయ్యాడు.

యేసుని రాజరికము ప్రత్యక్షంగా మనకు 30వ వచనంలో కనబడకపోయినను, "తన ఆత్మను అప్పగించెను" అన్న మాటలో ఆయన రాజరికపు ఛాయ అంతర్లీనంగా కనబడుతుంది. చేదు చిరకను ఆయన అందుకోగానే (ఆయన మాట్లాడునట్లు చేయుటకు) "సమాప్తమైనదని" చెప్పి తల వంచి "ఆత్మను అప్పగించాడు." యేసు హత్య "చేయబడ్డాడని" లేదా "చంపబడ్డాడని" ఏ సువార్త చెప్పడం లేదు. గాని ఆయన తనకు తానుగానే సరైన సమయంలో తన ఆత్మను అప్పగించుకున్నాడు.

"సమాప్తమైనదని" చెప్పడంలో యేసు యొక్క ఉద్దేశం ఏమిటి? ఏం సమాప్తమైనది? ఈ లోకంలో ఆయన పని సమాప్తమైంది. ఇంకా వివరంగా చెప్పాలంటే – యెషయా 53లో శ్రమనొందిన సేవకుడు మెస్సీయ/రాజుగా వచ్చి శ్రమపడి తన ప్రజలను విడిపించడం అన్న దేవుని ప్రణాళిక సమాప్తమైంది. నీయందు ఈ లోకములోని జనాంగములన్నియు ఆశీర్వదించబడునని దేవుడు అబ్రాహామునకు చేసిన వాగ్దానం. ఇశ్రాయేలు సింహాసనం మీద నీ కుమారుడు కూర్చుని శాశ్వత పాలన చేయునన్న దావీదు వాగ్దానం, "రాబోవు వాడు" తన ప్రజలను విడిపించునని ప్రవక్తల ద్వారా చెప్పబడిన వాగ్దానములన్నియూ నెరవేర్చబడ్డాయి. యేసుని మరణం మరో యూదా అపరాధి మరణం లేదా యూదుల తిరుగుబాటు నాయకుని మరణం వంటిది కాదు. తన ప్రజలను విడిపించడమే పనిగా వచ్చిన మెస్సీయ/రాజు యొక్క మరణం ఇది. ఆ విడిపించడం కూడా వారు ఊహించిన విధానంలో కాదు గాని, ఈ భూమికి పునాదులు వేయబడకముందే దేవుడు అనుకున్న ప్రణాళిక ప్రకారమైన విమోచన అది.

### ఆయన ఎందుకు మరణించాడు: మన పాపములను తీసివేయుటకు

యోహాను సువార్త ఆరంభమునకు తిరిగి వెళ్తే, బాప్తిస్మమిచ్చు యోహాను యేసును చూచి, "ఇదిగో లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల" (1:29) అని చెప్తున్నాడు. ఇటువంటి అసాధారణ పదప్రయోగం ద్వారా, యోహాను యేసును నిజమైన బలి గొఱ్ఱె పిల్లగా చూపిస్తున్నాడు. ఆయన అందరి నిమిత్తం ఒక్కసారే అర్పించదగిన పాప పరిహారార్థ బలి. తరువాత, "మన జనమంతయు నశింపకుండనట్లు, ఒక మనుష్యుడు ప్రజలకొరకు చనిపోవుట మీకు ఉపయుక్తము" (11:50) అని ప్రధాన యాజకుడైన కయప ప్రవచించాడు. ఇందుకు యోహాను యిలా చేర్చాడు,

> తనంతట తానే యీలాగు చెప్పలేదు గాని ఆ సంవత్సరము ప్రధానయాజకుడై యుండెను గనుక యేసు ఆ జనముకొరకును, ఆ జనముకొరకు మాత్రమేగాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకును, చావనైయున్నాడని ప్రవచించెను (11:51, 52).

మరో మాటలో చెప్పాలంటే, కేవలం యూదుల కొరకే యేసు చనిపోలేదు కాని, ఇశ్రాయేలునకు వెలుపటనున్న వారి నిమిత్తం కూడాను. ఇదే విషయం తిరిగి యోహాను 12:31-33లో చెప్పబడింది, "నేను భూమిమీదినుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించు కొందునని" [సిలువలో; 32 వచనం] యేసు ప్రకటించాడు.

యేసు వధింపబడబోయే గొఱ్ఱెపిల్ల అన్న విషయం యోహాను 19 మరియు 20 అధ్యాయములకు ముందు వ్రాయడం అన్నది యేసుని సిలువ బలి పస్కా పండుగ సమయంలో చోటు చేసుకోవడంతో ముడిపడి ఉంది. "పస్కా పండుగ" దినమున ఒకనిని విడుదల చేయడం వాడుక అని పిలాతు పేర్కొన్న 18:39 వచమును మనం ఇంతకు ముందే చూశాము. యేసుని ప్రజలముందు నిలువబెట్టి "ఇదిగో మీ రాజు" అని పిలాతు చెప్పినప్పుడు "ఆ దినము పస్కాను సిద్ధపరచు దినము" అని (19:14) యోహాను ప్రత్యేకంగా పేర్కొన్నాడు. సిద్ధపరచు దినం అనేది పస్కాకు ముందు వస్తుంది. ఆ సాయంకాలం విందు నిమిత్తం వధ గొఱ్ఱెపిల్లలను వధించి ఉంచుతారు (నిర్గమకాండము 12:6; లూకా 22:7). విశ్రాంతి దినమున దేహములను సిలువపై ఉంచకూడదన్న యూదుల నియమం చొప్పున ఆ రాత్రినుండి పస్కా పండుగ ఆరంభమవుతుంది. కాబట్టి అది సిద్ధపరచు దినము అని 31వ వచనం తెలియజేస్తుంది.

ఇందులోని విషయాన్ని మనం గుర్తించకుండా ఉండాలని యోహాను కోరుకోవడం లేదు – ఈ లోక పాపములను తీసివేయుటకు యేసు ఒక బలి గొఱ్ఱెపిల్లగా సిలువలో మరణించాడు. మనకోసం వేదన పడిన ఆ ప్రేమగాథ ఉద్దేశం మనలను సిలువ "యొద్దకు" తీసుకురావడమే. ఇక్కడే మనకు క్షమాపణ మరియు నిత్య జీవం దొరుకుతుంది.

### మరణం తరువాత ఏం జరుగుతుంది: ఆయన పునరుత్థానుడయ్యాడు

ఆదివారమున "వారంలోని మొదటి రోజు" యేసు ప్రభువు మరణమునుండి తిరిగి లేచారన్న గొప్ప సత్యమును యోహాను 20వ అధ్యాయం (1ఎ వచనం) తెలియజేస్తుంది. మగ్దలేనే మరియ పెందలకడ సమాధియొద్దకు వెళ్ళి "సమాధి మీద ఉండిన రాయి తీయబడి యుండుట చూచింది" (1బి వచనం). (మిగతా స్త్రీలు కూడా సమాధి యొద్దకు వచ్చినట్లు మిగతా సువార్తలలో వ్రాయబడియుంది కానీ యోహాను సువార్తలో ఈమెకు ప్రాధాన్యత ఇయ్య బడింది.) తరువాత, పేతురు యోహానులు సమాధిలో చూడగా, యేసుని నారబట్టలు ఒక పక్కగా చుట్టిపెట్టియుండుట చూచారు. దొంగిలించబడితే బట్టలు చెల్లాచెదురుగా ఉండేవి!

సమాధి ఖాళీగా ఉండడం మరియు ప్రభువు పునరుత్థానమునకు మగ్దలేనే మరియ మొదటి సాక్షి అన్నది గుర్తించదగ్గ విషయం. ఈ కథను ఆదిమ క్రైస్తవులు కల్పించలేదనడానికి ఇది బలమైన గుర్తు. ఇటువంటి కథను తయారు చేసి దీనికి ప్రథమ సాక్షులుగా స్త్రీలను ఎవరూ ఉంచియుండరు. ఎందుకంటే స్త్రీల సాక్ష్యం అంతగా నమ్మదగినది కాదు అని అప్పటివారి అభిప్రాయం. నాలుగు సువార్తలలో స్త్రీల గురించిన ప్రస్తాపనే ఉంది కాబట్టి, ఈ నాలుగు సువార్త కథనాల చారిత్రిక నిజస్థాపనకు ఇది బలమైన సవాలుగా నిలిచింది.

తరువాత పునరుత్థానంతర సంఘటను మనకు కనబడతాయి. యేసు మరియకు కనబడగానే ఆమె పొరపడి ఆయన్ను తోటమాలి అనుకున్న విషయం యోహాను 20:11-18లో చూస్తున్నాం. తరువాత ఆయన పదిమంది శిష్యులకు అగపడ్డాడు (మోసగించిన యూదా వీరిలో లేడు. అలాగే ఏదో కారణం చేత తోమా కూడా లేడు; 19, 20 వచనాలు). తరువాత పదిమంది శిష్యుల మాటలను విన్న తోమా, తాను ప్రభువును తన కళ్ళతో చూస్తేనే తప్ప నమ్మనని స్పష్టం చేశాడు. ఎనిమిది రోజుల తరువాత, యేసు తనను తాను తోమాకు కనపరుచుకున్నాడు. అది చూసి తోమా "నా ప్రభువా, నా దేవా" అని అన్నాడు! (28 వచనం).

పునరుత్థానంతరం యేసు విభిన్న ప్రత్యక్షతల గురించి[3] సువార్తలు విభిన్నంగా వివరిస్తున్నాయి. నలభై రోజుల పాటు ఆయన ప్రత్యక్షతలు జరిగాయని అపొస్తలుల కార్యములు 1:3 తెలియజేస్తుంది. అయితే ఏ సువార్త కూడా ప్రభుని పూర్తి ప్రత్యక్షతల సమాచారాన్ని తెలియజేయడం లేదు. ఎవరి సందర్భానికి ఏది అవసరమనిపించిందో వారు దానిని మాత్రం పేర్కొన్నారు. 1 కొరింథీయులకు 15:5-8లో పౌలు కొన్నింటిని గురించి తెలియజేస్తున్నాడు. యాకోబునకు (యేసు సహోదరుడు) ఒకసారి, "ఐదువందల మందికి" ఒకసారి కనబడినట్లు పౌలు వ్రాయగా, ఇవి సువార్తలలో వ్రాయబడలేదు.

ఈ ప్రత్యక్షతల ఉద్దేశం ఏమిటి? యేసుని కథలో ఇవి ఎందుకని ప్రాముఖ్యమైనవి? మొదటిగా, యేసు సజీవుడైయున్నాడని ఆయన అనుచరులకు ఇవి ప్రకటించాయి, అలాగే ఇందు నిమిత్తం వారు సాక్షులైయుండుటకు తోడ్పడ్డాయి. అపొస్తలునిగా ఉండాలంటే, ఒక వ్యక్తి యేసుని పరిచర్యల గురించి అనగా యోహానుచే యేసు బాప్తిస్మంపొందడంనుండి ఆయన పరమునకు ఆరోహణమవ్వడంవరకు అన్నిటికి ప్రత్యక్ష సాక్షి అయి ఉండాలి (అపొస్తలుల కార్యములు 1:21, 22). "నేను స్వతంత్రుడను కానా? నేను అపొస్తలుడను కానా? మన ప్రభువైన యేసును నేను చూడలేదా? ..." (1 కొరింథీయులకు 9:1) అని చెప్తూ పౌలు తన అపొస్తలత్వమును సమర్థించుకుంటున్నాడు. దమస్కు దారి ప్రయాణం అనుభవం ఆయన ఈ మాటలకు కారణము (ఒకసారి కాదు మూడుసార్లు; అపొస్తలుల కార్యములు 9; 22; 26). పన్నెండుమంది అపొస్తలులలో పౌలు ఒకడు కాదు కాబట్టి - ప్రభువు తనను అపొస్తలుడుగా పిలుచుకున్నాడన్నందుకు అతడు పునరుత్థాన ప్రభువు ప్రత్యక్షతను సాక్ష్యముగా ఉంచుతున్నాడు. కాబట్టి, సువార్త విస్తరణలో పునరుత్థానంతర ప్రత్యక్షతలు ఎంతో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

రెండవదిగా, యేసును దేవుని కుమారునిగా గుర్తించుటకు ఈ ప్రత్యక్షతలు సహకరిస్తున్నాయి. ఒకవేళ ఆయన దేహం అలా సమాధిలోనే ఉండిపోయినట్లయితే, ఆయన కల్పితముగాను, క్రైస్తవ్యం అబద్ధంగానూ మిగిలిపోయియుండేవి. అనేకమైన అసత్య ధార్మిక ఉద్యమాల వలనే ఇది కూడ ఆత్మీయ శూన్యతలో అస్థిత్వం లేనిదిగా ఉండేది. కానీ, యేసు సమాధినుండి తిరిగి లేచాడనడానికి, ఆయన ప్రత్యక్షతలు దీన్ని సమర్థిస్తున్నాయి కాబట్టి పరిస్థితి విభిన్నంగా ఉంది. పౌలు దీనినే రోమీయులకు 1:4లో స్పష్టం చేస్తున్నాడు, "యేసు క్రీస్తు ... మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను." "నిరూపింపబడెను" అన్న పదము "స్పష్టం చేయబడెను" లేదా "స్థాపించబడెను" అన్న అర్థమును కూడా యిస్తుంది. యేసు

మరణమునుండి పునరుత్థానుడగుటవలన దేవుని కుమారుడు అయ్యాడని పౌలు చెప్పడం లేదు గాని, పునరుత్థానం ద్వారా ఆయన దేవుని కుమారునిగా "స్పష్టం చేయబడ్డాడు" లేదా "స్థాపించబడ్డాడు."

ఒక హత సాక్షిని జ్ఞాపకం చేసుకుంటూ క్రైస్తవులు ఆరాధించరు గాని, సిలువవేయబడి మరణించి, తిరిగి పునరుత్థానుడై – ప్రస్తుతం పరమందుండి మన పక్షమున తండ్రికి విజ్ఞాపన చేస్తున్న వానిని స్మరిస్తు ఆరాధిస్తారు. అటువంటి మన దేవుడు పరిశుద్ధాత్మని ద్వారా ఇప్పుడు మనలో కూడా ఉన్నాడు. "ప్రభువు బల్ల" భోజన సమయంలో మనమాయనతో కూడా సహవాసం పొందుతున్నాము. పూర్వమందు జరిగిన ఒక సంఘటనను ఇది జ్ఞాపకం చేసుకోవడం కాదు గాని (ఇదే అయినా కానీ); ఇది పునరుత్థానుడైన క్రీస్తు మరియు ఆయన అనుచరులకు మధ్య సజీవ సహవాసం. యేసు చనిపోయి అలాగే మృతుడైయుండిపోలేదు గనుక, ఈనాడు మనకు నిజమైన జీవ నిరీక్షణ ఉంది, మన దేవునితో సహవసిస్తున్నాము.

## "మీరు నమ్మునట్లు"

ఈ సువార్తను వ్రాయడంలో యోహానుకు గల "ఉద్దేశమును" యోహాను 20లోని ఆఖరి రెండు వచనములు తెలియజేస్తున్నాయి. అతడు చెప్తున్న దాని కంటె మరింత ఎక్కువ ఆయన్ను గురించి సాక్ష్యమియ్యవలెనని, అందును గురించి వ్రాయుటకు ఒక్క గ్రంథం సరిపోదని అతడు పేర్కొంటున్నాడు (అటువంటి వాక్యం కొరకు 21:25ను చూడు). యేసును గురించి తనకు తెలిసినదంతయు వ్రాయుటకంటే, ఆయన పరిచర్యలోని కొన్ని కార్యములను జాగ్రత్తగా ఎంచుకున్నాడు. అవి అవిశ్వాసిలో విశ్వాసమును కలుగజేసేవిగా మరియు విశ్వాసిలో విశ్వాసమును కలిగించేవిగా ఉన్నాయి. యేసును గురించిన సమాచారం ఇవ్వడం మాత్రమే యోహాను ఉద్దేశం కాదు గాని, మనలను మార్చుడడం బలపర్చుడం మాత్రమే అతని ఉద్దేశం.[4] అతడు ఈ లేఖనమును వ్రాయుటలో గల ప్రధాన ఉద్దేశం ఇదే "... నమ్మి, ఆయన నామమందు జీవము పొందునట్లును ఇది వ్రాయబడెను" (31 వచనం). కథను తెలుసుకోవడం విశ్వాసమునకు అవసరం. జీవము పొందడానికి విశ్వాసం అవసరం.

## ముగింపు

సిలువలో ప్రభుని శ్రమల మీదనే ఎక్కువ దృష్టియుంచక, అంతకంటే మరి ప్రాముఖ్యమైన విషయాల వైపు మన దృష్టిని యోహాను మళ్ళిస్తున్నాడు. యూదుల రాజుగా, ఈ లోక రక్షకుడిగా యేసు చనిపోయాడు. మన పాపములనుండి మనలను విమోచించుటకు ఆయన చనిపోయాడు. అలాగే ఆయన పునరుత్థాములో మనము పాలుపొందే విధంగా మనకు "సజీవ నిరీక్షణను" కూడా ఇచ్చాడు.

---

సూచనలు

[1]Eusebius *Ecclesiastical History* 4.15.4. [2]చూడు యోహాను 19:20. యిక్కడ చెప్పబడిన "హీబ్రూ" అనేది పాలస్తీనా యూదులు సమాజంగా వాడే అరామిక్ భాషను సూచిస్తుంది. రోమా సామ్రాజ్యమునకు లాటిన్ భాష అధికారిక భాష. నాల్గు వందల సంవత్సరాల క్రితం మహా అలెగ్జాండరు మధ్యధరా ప్రాంతమును జయించిన ఫలితంగా గ్రీకు అక్కడ ప్రాచుర్యం చెందింది. [3]ఇందుకు మార్కు సువార్తను మినహాయించవచ్చు, మార్కు 16:9–20 వాక్య భాగంను తప్పిస్తే, ఈ వాక్య భాగం అసలు

ప్రతులలో లేదు అని కొన్ని తర్జుమాలు తెలియజేస్తున్నాయి. [4]ఈ విషయం మత్తయి, మార్కు, లూకా సువార్తల విషయంలోనూ సత్యమే. అయితే యోహాను తన ఉద్దేశమును స్పష్టంగా చెప్తున్నాడు. చదువరిని ఉద్దేశించి ("నీవు") మాట్లాడుతుంది ఇతనొక్కడే. ఈ కథ సాధారణంగా చెప్పబడలేదని ప్రతి వ్యక్తిని ఉద్దేశించినదని చదువరికి తెలుసుకోవాలని అతడు కోరుతున్నాడు.